: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్


సంపుటి : 2 | సంచిక : 15 | 17-01-2022 | పుటలు : 4

## కళాశాలలు నాణ్యమైన విద్యను అందించాలి

**10.01.22 (మీడియాసెల్)** ఉభయగోదావరి జిల్లాల్లోని ఎందరో మహనీయులు ఉన్నత ఆశయాలతో కళాశాలలను ప్రారంభించారని,అందరికీ నాణ్యమైన విద్యను అందించాల్సిన ప్రాథమిక బాధ్యత కళాశాలపై ఉందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో సోమవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ అనుబంధ యూజీ, పీజీ కళాశాలల మేనేజ్మెంట్స్ అసోయేషన్ జనరల్ బాడీ మీటింగ్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఉన్నత విద్యకు ఎంతో ప్రాధాన్యతనిస్తున్నారని, నాణ్యమైన విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని, కోవిడ్ వంటి సంక్షోభ పరిస్థితుల్లో విద్యాపరమైన అంశాలకు కోట్లాది రూపాయల నిధులను విడుదల చేసారని అన్నారు. దానికి తగినట్టుగా విద్యావేత్తలంతా కృషి చేసి రాష్ట్రంలో నాణ్యమైన ఉన్నతను అందించేందుకు పాటుపడాలని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ స్థాపనకు కృషి చేసిన స్వర్గీయ వై.ఎస్.రాజశేఖరరెడ్డి పేరును విశ్వవిద్యాలయ పరిపాలన భవనానికి, జక్కంపూడి రామ్మోహనరావు పేరును యూనివర్సిటీ సైన్స్ కాలేజ్ బ్లాక్ కు పెట్టేందుకు ఈసీలో అనుమతి లభించిందన్నారు. యూనివర్సిటీ స్థాపనకు సంబంధించిన శిలాఫలకాన్ని పునఃప్రతిష్ఠించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోని ఎందరో మహనీయులు ఉన్నత ఆశయాలతో విద్యాసంస్థలను స్థాపించారని వారి ఆశయాలకు అనుగుణంగా నాణ్యమైన ఉన్నత విద్యను విద్యార్థులకు అందించాలని తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలోని చాలా కళాశాలలు విలువలను పాటిస్తూ నాణ్యత ప్రామాణాలతో విద్యనందిస్తున్నాయని చెప్పారు. కానీ కొన్ని కళాశాలల్లో నాణ్యత ప్రమాణాలు లోపిస్తున్నాయని అటువంటి కళాశాలలు ఆత్మపరిశీలన చేసుకొని నాణ్యమైన విద్యను అందించడమై కళాశాలల ప్రాథమిక కర్తవ్యమని గ్రహించాలన్నారు. అనుబంధ కళాశాలల అసోసియేషన్లు నాణ్యమైన విద్యను అందించని కళాశాలలను గుర్తించి వాటిని సరిచేయాలన్నారు. కళాశాలలు అంటే కేవలం విద్యార్థులకు సర్టిఫికెట్ ఇచ్చే కేంద్రాలు కాదని, విజ్ఞానాన్ని అందించి సమసమాజ నిర్మాతలను తయారు చేసే గొప్ప దేవాలయాలని అన్నారు. విద్యకు, విద్యాసంస్థలకు, గురువులకు ఉన్న గౌరవాన్ని మరింత పెంపొందించుకొనే విధంగా పని చేయాలని చెప్పారు. ఈస్ట్, వెస్ట్ కళాశాలలు బెస్ట్ అనిపించుకొనే స్థాయికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ కళాశాలలు ఎదగాలని తెలిపారు. విద్యాప్రగతికి, కళాశాలల సహకారానికి తాను ఎప్పుడూ ముందుంటానని అన్నారు. నాణ్యమైన విద్యను అందించే కళాశాలలను తప్పక ప్రోత్సహిస్తామని సూచించారు. తరువాత ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రైవేట్ డిగ్రీ కాలేజేస్ ఆసోసియేషన్ లోకి వైస్.ప్రెసిడెంట్ గా గంధం నారాయణరావు, జాయింట్ సెక్రటరీగా మహ్మద్ హబీబ్ బాషా, అసోసియేషన్ ఈసీ మెంబర్స్ గా జి.గౌతమ్, ఎ.బి.నాయుడు ఎన్నికయ్యారు. అనంతరం అతిథులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రైవేట్ డిగ్రీ కాలేజేస్ ఆసోసియేషన్ సెక్రటరీ జె.రమణ, ఆదికవి నన్నయ యూనివర్సిటీ అఫిలియేటేడ్ యూజీ, పీజీ కాలేజేస్ మేనేజ్మెంట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు టి.కె.విశ్వేశ్వరరెడ్డి, ప్రెసిడెంట్ కె.నరసింహారావు, వైస్.ప్రెసిడెంట్స్ తోట వాసు(తూర్పుగోదావరిజిల్లా), బ్రహ్మాజి(పశ్చిమగోదావరి జిల్లా) మరియు ఉభయగోదావరి జిల్లాల అనుబంధ కళాశాలల యాజమన్య సభ్యులు పాల్గొన్నారు.




## యువత వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి



వివేకానంద చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న వీసీ

**12.01.22 (మీడియాసెల్)** యువతరం స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని భారతదేశ అభివృద్ధికి పాటుపడాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఈసీ హాల్ లో బుధవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ముఖ్యఅతిథిగా హాజరై వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో భారతదేశ ఔన్నత్యాన్ని, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. చికాగోలో జరిగిన అంతర్జాతీయ సమావేశంలో "మైడియర్ బ్రదర్స్ అండ్ సిస్టర్స్" అని సంబోధిస్తూ ఉపన్యసించారని గుర్తుచేసారు. ఇతర దేశాలకంటే అత్యధిక యువతగల దేశం భారతదేశమని, ఇటువంటి భారతదేశంలో యువతను సమగ్రమైన మార్గంలో నడిపిస్తూ వారి శక్తిని ఉపయోగించుకుంటే దేశం అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. యువతను సమగ్రమైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు. గురువులు స్వామి వివేకానంద మాదిరిగా సమాజానికి మార్గనిర్దేశం చేయాలన్నారు. వివేకానంద సూక్తులు యువతరాన్ని మేల్కొల్పే అక్షర శక్తులని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, నాక్ ఎక్జిక్యూటీవ్ కోఆర్డినేటర్ డా.కె.వి.స్వామి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.ఎం.గోపాలకృష్ణ మరియు ఆయా విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## గ్రంథావిష్కరణ

పశ్చిమగోదావరి జిల్లా గౌరిపట్నం శ్రీపర్వతం శ్రీనివాస ప్రభువు సన్నిధానంలో ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు classical Indian Mathematics and Astronomy గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ గ్రంథాన్ని international Institute of Vedic sciences ప్రచురించింది. చిత్రంలో యోగమిత్ర మండలి అధ్యక్షులు ఎమ్.వి.ఎస్. ప్రసాద్, IIVS అధ్యక్షులు జి.ఎస్.రాజు, ప్రముఖ న్యాయవాది పి.శ్రీనివాసరావు, గదాధర్, ఎక్కిరాల దత్తాత్రేయ పాల్గొన్నారు.



### సెలవుల్లో నాక్ పనుల్లో ..

## నిమగ్నమైన అధ్యాపకులు



నాక్ పనులను పరిశీలిస్తున్న వీసీ జగన్నాథరావు

**11.01.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపు తీసుకురావాలనే గొప్ప సంకల్పంతో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పనిచేస్తున్నారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. త్వరితగతిన నాక్ పనులు పూర్తి చేసి విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపును తీసుకురావాలనే ఉద్దేశంతో వీసీ పర్యవేక్షణలో అధికారులు, ఆయా క్రైటీరియాల సిబ్బంది సంక్రాంతి సెలవుల్లో సైతం నాక్ పనుల్లో నిమగ్నమయ్యారు. మంగళవారం విశ్వవిద్యాలయంలోని నాక్ పనులను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సంక్రాతి సెలవు దినాలలో కుటుంబాలతో ఆనందంగా గడపడం కంటే నన్నయ విశ్వవిద్యాలయ కుటుంబ అభివృద్ధినే ఆకాంక్షిస్తూ నాక్ పనుల్లో నిమగ్నమైన అధ్యాపకులను అభినందించారు. నాక్ సాధనకు అవసరమైన పలు సూచనలు, సలహాలు అందించేందుకు నాక్ అనుభవం కలిగిన నాగార్జున యూనివర్సిటీ ఆచార్యులు నాగేశ్వరరావు నన్నయ యూనివర్సిటీకి రావడం ఆనందకరమన్నారు. నాగేశ్వరరావు సేవలను అన్ని క్రైటిరియాల అధ్యాపకులంతా ఉపయోగించుకోవాలని చెప్పారు. విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపు ఎంతో అవసరమని ప్రతీ ఒక్కరూ నాక్ సాధన కోసం పని చేయాలని అన్నారు. నాక్ ద్వారా అనేక నిధులు సమకుర్చుకొని విశ్వ విద్యాలయాన్ని అభివృద్ది చేసేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కమిటీ సభ్యులు నాక్ మార్గదర్శకాలను అనుసరించి సెవెన్ క్రైటీరియాలకు సంబంధించిన సమాచారాలను సిద్ధం చేసుకొని ఉంచాలని తెలిపారు. సెల్ఫ్ స్టడీ రిపోర్ట్(ఎస్.ఎస్.ఆర్) ద్వారా 70 శాతం మార్కులు వస్తాయని, కాబట్టి నాక్ కమిటీ సభ్యులు రిపోర్డుకు కావాల్సిన సమాచారాన్ని చక్కగా ప్రదర్శింపచేయాలని తెలియజేసారు. సమష్టి కృషితో నాక్ గుర్తింపు సాధించి విశ్వవిద్యాలయ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. నాక్ సాధనకు అవసరమైన పలు కీలక అంశాలపై దిశనిర్ధేశం చేసారు. ఎస్.ఎస్.ఆర్ లో బోధన ప్రమాణాలు, పరిపాలన, పరిశోధనలు, విద్యార్థుల భాగస్వామ్యం వంటి 7 ప్రధాన అంశాలపై జరుగుతున్న పనితీరు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ కోఆర్డినేటర్ డా.కె.వి.స్వామి, క్రైటిరియా సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం




# వేమన జయంతి

" సాధనమున పనులు సమకూరు ధరలోన "
ఇలా పద్యంలో మూడో పాదం గొప్ప సూక్తి. ఆ సూక్తిని మన మదిలో నిలవటానికి పైన రెండు పాదాలు ఒక ఉదాహరణ. నాలుగో పాదం మకుటం ' విశ్వదాభిరామ వినురవేమ '

వేమన పద్యం, సూక్తి తెలియని తెలుగు వారు ఉండరు. ఆయన సూక్తులు తెలియనివారుండరు. చదువులు సరిగ్గా సాగని సాధారణ ప్రజల నాలుకల మీద కూడా వేమన పద్యం,సూక్తి నర్తిస్తూనే ఉంటుంది. అందుకనే వేమన

ప్రజాకవి. ఆ ప్రజాకవి జనులకు జ్ఞాన మార్గాన్ని బోధించాడు. అవన్నీ నీతి పద్యాలుగా ప్రాచుర్యాన్ని పొందాయి. తెలుగు వాచకాల్లో,శతకాలుగా ప్రచురించిన పుస్తకాల్లో వివాద రహితమైన సామాన్య నీతుల్నే చేర్చారు కాబట్టి వాటికే ఎక్కువ ప్రాచుర్యం కలిగింది. సంఘ జీవనానికి చీడపురుగుల్లా దాపురించిన అవినీతిని, దురాచారాలను ఖండించిన పద్యాలు కూడా చాలా ఉన్నాయి. అసలు సిసలైన తత్త్వమే వేమన గమ్యం. చీకట్లో కొట్టుమిట్టాడే సామాన్య జనుల్ని కాంతితీరం వైపునకు దారి చూపించాడు.

సాంఘిక దోషాలను సరిదిద్దటానికి మానవత్వ సిద్ధాంతంతో పోరాడటం వేమన పద్యాల్లో కనిపిస్తుంది. బహుశా ఆ సాహసమే వేమన పద్యాలలోని సౌందర్యానికి కారణం కూడా. సాంఘిక దురాచారాల నుంచి, అధర్మాల నుంచి మనిషిని రక్షించటమే వేమన ఉద్దేశం.

మానవత్వమే వేమన మతం. మానవత్వం ఒక మతం కాదు. ఒక విశాల దృక్పథం. అది విశ్వజనీనమైన అంశం. మనిషి జీవితానికి సంబంధించిన ప్రాథమికమైన విలువలపైనే దాని ఋజుదృష్టి కేంద్రీకరించి ఉంటుంది. గంభీరమైన తాత్త్విక చర్యలకన్నా సమాజ జీవనంపైన వాటి ప్రభావమే వేమనకు ముఖ్యం. వేమన జీవితాన్ని సంపూర్ణంగా దర్శించినవాడు.

జీవితంలోని కీలక సంఘటనలు, ఉద్రేకపూరితమైన అనుభవాలు, తీరని కోరికలు... ఇవన్నీ మనిషిని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి.వేమనది సహజమైన ఉద్రేక ప్రకృతి. దాని వలనే ఆయన పలుకులకు జవజీవాలు కలిగాయి. నిజాయితీగల జీవితం నుంచే సత్యం పుడుతుంది. సత్యమే మానవత. ఈ రెండింటి సమ్మేళనమే వేమన పద్యాలలోని అంతస్సారం.

నిర్జీవమైన కొన్నిటికి వీడ్కోలు చెబుతూ కొత్త పరిణామాలకు స్వాగతం పలికాడు వేమన.మూఢ విశ్వాసాల మీద సమరం ప్రకటించాడు.మానవత్వంతో విరుచుకుపడ్డాడు.ఆ సమరానికి లక్షణం సమాజ ప్రగతి.

రాతి బాటల్లో జాతిరత్నాలు వెదజల్లిన కవి వేమన.ఆయన పేరు మీదుగా 'యోగి వేమన విశ్వవిద్యాలయం' కడప జిల్లాలో నెలకొల్పటం ఆయన పట్ల మనకున్న కృతజ్ఞత!

వేమన అనే కవి ఒకరు జీవించారని, ఆయన పద్యాలు ఇవేనని మన చేతుల్లో పెట్టిన గొప్ప పరిశోధకుడు సి.పి. బ్రౌన్ మహాశయుని ఒకసారి గుర్తు చేసుకోవడం మన బాధ్యత!!

# ఒక తరం నుంచి మరో తరానికి మహాప్రస్థానం



శ్రీశ్రీ కేవలం రెండక్షరాలు. అతని గీతాలు మాటలు కావు. నిత్యం జ్వలించే మంటలు. పదునెక్కిన కత్తులు, ఈటెలు. ఆ శబ్దాలు రణన్నినాదాలు.మరో ప్రపంచపు కంచునగారాను వినిపించిన శబ్దయోధుడు శ్రీశ్రీ. ఉషాగమనాన్ని గుర్తించి స్వాగతించే వైతాళికుడు శ్రీశ్రీ. ఎఱ్ఱబావుటా నిగనిగలను కాంచగలిగిన దార్శనికుడు శ్రీశ్రీ.

తన గీతాలతో ఒక తరాన్ని ఊగించి, శాసించి, ముందుకు నడిపించిన యుగకర్త శ్రీశ్రీ.మరో ప్రపంచాన్ని స్వప్నించిన మహాకవి శ్రీశ్రీ.

మహాప్రస్థానం ఒక తుఫాను.
యువతను ఊగించే సునామీ.

సుడిగాలిలా గిరాగిరా తిప్పేసే టోర్నడో.డెబ్బై ఏళ్ళ క్రితమే ఇది అచ్చయింది.లెక్కలేనన్ని సార్లు పునర్ముద్రణ పొందింది.

నిన్న గాక మొన్న చేటంత (కాఫీ టేబుల్ ) సైజులో వచ్చి అలరించింది.మహాప్రస్థానానికి మళ్ళీ ఎంత మహర్దశ!

మహాప్రస్థానం గీతాలు మార్క్స్ ఎంగెల్స్ రాసిన కమ్యూనిస్టు ప్రణాళిక సారాంశానికి తెలుగు కవిత్వీకరణలా అనిపిస్తుంది.

కానీ, ఈ గీతాలు రాశాకనే శ్రీశ్రీ ఆ ప్రణాళికను చదివారు.

మహాప్రస్థానం గీతాలను శ్రీశ్రీ 1933-47 మధ్యరాశారు.

మహాప్రస్థానం 1950లో తొలిసారిగా అచ్చయింది.

ప్రపంచంలో 1930-40 మధ్య కాలాన్ని 'హంగరీస్ థర్టీస్' అంటారు చరిత్ర కారులు.రష్యా తప్ప ప్రపంచమంతా ఆర్థిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతున్న రోజులు.


రెండవ ప్రపంచ యుద్ధానికి రిహార్సల్స్‌గా సాగిన అంతర్యుయుద్ధం. అప్పుడే ఇంగ్లాండులో ప్రొగ్రెసివ్ రైటర్స్ మానిఫెస్టో వచ్చింది.ఈ నేపథ్యంలోనే మహాప్రస్థానం గీతాలు శ్రీశ్రీ హృదయం నుంచి ప్రవాహంలా వచ్చిపడ్డాయి.

ఛందస్సులను ఛట్‌ఫట్ మని తెంచేశాడు.వ్యాకరణాల సంకెళ్ళను తెంచుకున్నాడు.

'నేను సైతం' లో గణబద్ధ ఛందస్సుకు స్వస్తి చెప్పి, గురజాడ అడుగుజాడను అనుసరించాడు.

మహాప్రస్థానంతో సామాజిక రుగ్మతల వేగాన్ని శ్రీశ్రీ తగ్గించాడు.

ఈ రుగ్మతలు పూర్తిగా పోవడానికి శస్త్ర చికిత్స అవసరమన్నాడు.




## పుస్తకం



దానినే విప్లవం అన్నాడు శ్రీశ్రీ.

నిన్న ఒదిలిని పోరాటం నేడు అందుకొనక తప్పదని యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపాడు.

తెలుగు కవిత్వాన్ని ఒక మలుపు తిప్పాడు.

శ్రీశ్రీ ఎప్పుడూ తటస్థంగా లేదు.

జీవిత ప్రవాహానికి దూరంగా గట్టున కూర్చోలేదు. కరుడుగట్టిన సంప్రదాయ వాది విశ్వనాథను సైతం ' కవితా ఓ కవితా ' కదిలించేసింది.మరే భాషలోనూ ఇంత గొప్ప కవిత రాలేదు.

ఇది శ్రీశ్రీ సొంత గొంతుక, సొంత దస్తూరి.నిజానికి శ్రీశ్రీ గీతాలు ఒట్టి అక్షరాలు కావు.అవి బాధలు, ఉద్రేకాలు, యుద్ధాలు. మహాప్రస్థానం అంటే సామ్యవాద ప్రపంచం వైపు చేసే ప్రయాణం.

ఈ గీతాలలో శ్రీశ్రీ వాడిన అనేక పదాలకు అర్థాలు చాలా మందికి తెలియవు.ఆ ప్రవాహం వారిని లాకెళ్ళిపోతుంది.ఆ ఊపు అర్థం కాని పదాలను కూడా వారికి అర్థమయ్యేలా చేస్తుంది.

ఈ చిన్న సైజు మహాప్రస్థానంలో చాలా పదాలకు అర్థాలిచ్చారు.

చెలం అన్నట్టు ఈ వృద్ధ ప్రపంచానికి శ్రీశ్రీ నెత్తురు, కన్నీళ్లు కలిపి తయారు చేసిన కొత్త టానిక్ మహాప్రస్థానం.కొత్త రక్తాన్ని కదను తొక్కించిన సంగీతం.
రాబందుల రెక్కల చప్పుడు'
పయోధర ప్రచండ ఘోషం'
ఝంఝూనిల షడ్జ ధ్వానం..
విని తట్టుకోగలిగే శక్తి, చావ ఉంటేనే ఈ పుస్తకాన్ని తెరవండి అంటాడు చెలం.

**- రాఘవ శర్మ**

## ప్రతిభా వాణి

# మల్లాది చంద్రశేఖరశాస్త్రి

**(28.8.1925 - 14.1.2022)**



స్వరంలోని మాధుర్యం. ఇతిహాసాలపై, సాహిత్యంపై ఆయనకు ఉన్న పట్టు కారణంగా పురాణ ప్రవచన ప్రముఖులలో ఆయన ప్రత్యేకతను సంతరించుకున్నారు. ఆయన పదిహేనవ ఏట నుండి ప్రారంభించిన ప్రవచన యజ్ఞం అసిధారావ్రతంగా నిన్నటి వరకు కొనసాగుతూనే ఉంది. 96 ఏళ్ళ వయస్సు. ఉపన్యాసం, హరికథ, నాటకం, పురాణం కలిపి శ్రోతలను ఆకట్టుకునే విధంగా ప్రవచనం చేయటంలో సుప్రసిద్ధులాయన. అమరావతి ప్రాంతం ఆయన జన్మస్థలం. తాతగారైన రామకృష్ణ విద్వత్ చయనులు వద్ద సంస్కృత, తెలుగు భాషా సాహిత్యాలను అధ్యయనం చేశారు. ఎన్నో సంస్థలు, వ్యక్తులు వారికి సత్కారాలు, సన్మానాలు, బిరుదులు ప్రదానం చేశారు. శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు, భద్రాద్రి రాముని కల్యాణానికి వ్యాఖ్యాతగా వ్యవహరించి స్వామివారి కల్యాణాన్ని కన్నుల ముందు సాక్షాత్కరింపజేసిన అభినవ వ్యాసుడాయన. మహాభారతం లోని సందేహాలు తీర్చే ధర్మ సూక్ష్మాలు గ్రంథాలను వెలువరించారు. 2005లో ప్రతిష్టాత్మక రాజా - లక్ష్మీ పురస్కారం పొందారు. సనాతన ధర్మ ట్రస్ట్ ద్వారా ఎమినెంట్ సిటిజన్ అవార్డును అందుకోవటమే కాక నాటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావు గారితో సత్కారం అందుకున్నారు. రామాయణ, భారత, భాగవత కావ్యాలలో ధర్మసూక్ష్మాలపై ఆయనకున్న సాధికారత మరెవరికీ లేదంటే అతిశయోక్తి కాదు.

పండుగ రోజున పరమేశ్వరుని సాయుజ్యం పొందిన ఆ మహానుభావునికి నన్నయవాణి అక్షరనివాళిని సమర్పిస్తోంది.

# షోడశ విద్యాఫలాలు @ 2020,2021

సంక్రాంతి పంటల పండుగ. రైతుల పండుగ రోజున రెండేళ్లక్రితం విశ్వవిద్యాలయానికి ఉపకులపతి బాధ్యతలు స్వీకరించిన ఆచార్య మొక్కా జగన్నాథరావు గారు చాళుక్య ద్వారంలోంచి ప్రవేశించే ఈ రాజరాజనరేంద్రనగర్ నన్నయ విశ్వవిద్యాలయంలో 16 పంటల్ని(షోడశ విద్యాఫలాల్ని) పండించారు. విశ్వవిద్యాలయ క్షేత్రంలో పండిన పంటల వివరాల్ని నన్నయవాణి మీముందుంచుతోంది.



## ISO

9001 - 2015 విశ్వవిద్యాలయంలోని బోధన, సౌకర్యాలు, విభాగాలు, గ్రంథాలయం... ఇలా విద్యాపరమైన అన్ని విషయాలను పరిశీలించి మదింపు చేసినమీదట ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ ఈ గుర్తింపును ఇస్తుంది. దీనిని విశ్వవిద్యాలయానికి తీసుకొని రావటానికి చేసినకృషి ఎంతో విశేషమైంది.

## AICTE

**ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్**

ఇంజనీరింగ్ కోర్సులకు, ఎం.బీ.ఏ, ఎం.సీ.ఏ కోర్సులకు ఈ గుర్తింపు చాలా అవసరం, తప్పనిసరి కూడా. చాలాకాలం నుండి ఈ గుర్తింపు గురించి, అనుమతి గురించి విశ్వవిద్యాలయం ప్రయత్నం చేస్తోంది. నేటికి ఈ గుర్తింపు లభించింది. విశ్వవిద్యాలయంలోని కోర్సులతోపాటు, కాకినాడ క్యాంపస్ లోని ఎం.బీ.ఏ,ఎం.సీ.ఏ. కోర్సులకు కూడా ఈ గుర్తింపు లభించింది. దీనివలన ఎన్నో నిధులతో పాటు విద్యాపరమైన స్కీమ్స్, విద్యార్థులకు స్కాలర్ షిప్స్, అధ్యాపకులకు ప్రయోజనాలు కలుగుతాయి. ఈ గుర్తింపు విశ్వవిద్యాలయానికి ఈ ఏడాది లభించింది.

## 100 వెబినార్స్

కోవిడ్ 19 సమయంలో ప్రపంచ సమాజం స్తంభించింది. విద్యాలయాలు మూతపడ్డాయి. ఈ తరుణంలో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు ఆన్లైన్లో మరిన్ని విషయాలు తెలుసుకోవటం కోసం నాలుగు మాసాల లాక్ డౌన్ వ్యవధిలో అన్ని విభాగాల నుండి అన్ని సబ్జెక్టుల్లో నిపుణులైన ఉపన్యాసకులు, పరిశోధకులతో వందకు పైగా వెబినార్స్, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్, వర్క్ షాప్స్, సింపోజియమ్స్ నిర్వహించారు. విద్యాపరమైన స్తబ్దతను ఛేదించి ఇన్ని కార్యక్రమాలను నన్నయ విశ్వవిద్యాలయం మాత్రమే చేయగలగటం ఆదర్శ ప్రాయం.

## ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్

తక్కువ వ్యవధిలో కోవిడ్ సంక్షోభాన్ని ఛేదిస్తూ విద్యార్థులకు, అధ్యాపకులకు గొప్ప ప్రయోజనాన్ని కలిగించటానికి నిర్వహించిన వంద కార్యక్రమాలకు గాను ఈ పురస్కారం, గుర్తింపు విశ్వవిద్యాలయానికి లభించింది.

## ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్

తక్కువ వ్యవధిలో కోవిడ్ సంక్షోభాన్ని ఛేదిస్తూ విద్యార్థులకు, అధ్యాపకులకు గొప్ప ప్రయోజనాన్ని కలిగించటానికి నిర్వహించిన వంద కార్యక్రమాలకు గాను ఈ పురస్కారం, గుర్తింపు విశ్వవిద్యాలయానికి లభించింది.

## NAAC సాధనలో...

IQAC ద్వారా 7 క్రైటీరియాల్లో 30 మంది అధ్యాపకులు 90 వరకు వర్క్ పూర్తి చేశారు. త్వరలోనే గ్రేడింగ్ సాధించే విధంగా పని జరుగుతోంది. 2022 లో న్యాక్ గ్రేడింగ్ పొందే దిశగా వీసీ,అధికారుల పర్యవేక్షణలో కృషి వేగవంతంగా జరుగుతోంది.

## నన్నయవాణి

2020 అక్టోబర్ 2 గాంధీజయంతి రోజున 'నన్నయవాణి' పేరుతో విశ్వవిద్యాలయస్థాయి తొలి తెలుగువారపత్రికను స్థాపించారు. విశ్వవిద్యాలయ విద్యాసమాచారం, ప్రగతి, విద్యార్థుల విజయాలు-సృజన, అధ్యాపకుల విజయాలు, ప్రతిభావాణి, పుస్తక సమీక్ష, సంపాదకీయం, మంచిమాట, ముఖాముఖి,స్ఫూర్తి, మన కళాశాలలు, శీర్షికలతో, సామాజిక రచనలతో ప్రతి సోమవారం ఆన్లైన్లో 4 పుటలతో విడుదలవుతోంది. ప్రత్యేక సంచికలు ప్రచురణ జరుగుతోంది.

## బుక్స్ బై డోనార్స్

విశ్వవిద్యాలయానికి దాతలు సమర్పించిన సుమారుగా 11,000 విలువైన గ్రంథాలతో విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయంలో ఒక ప్రత్యేకమైన విభాగంగా 'దాతలు సమర్పించిన గ్రంథనిలయాన్ని' ఏర్పాటు చేయడం. ఇది పరిశోధకులకు ఎంతగానో ప్రయోజనాన్ని కలిగిస్తుంది.

## క్రీడారంగ అభివృద్ధి

విశ్వవిద్యాలయంలోని క్రీడారంగం పరమైన అభివృద్ధి కార్యక్రమాలకు 8 కోట్లకు పైబడిన నిధులు మంజూరయ్యాయి. వీటికి స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం లభించింది. వీటితో స్విమ్మింగ్ పూల్, రన్నింగ్ ట్రాక్,వాల్ బ్యాడ్మింటన్ కోర్టు, ఇండోర్ గేమ్స్ సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు.

## ప్రాంగణ పర్యావరణం

జాతీయ రహదారి నుండి చాళుక్య ద్వారం ద్వారా విశ్వవిద్యాలయంలోనికి ప్రవేశిస్తున్నప్పుడు పూల మొక్కలు ఆహ్వానం పలుకుతాయి. పచ్చని పర్యావరణం కోసం విశ్వవిద్యాలయంలోని అన్ని ప్రాంతాల్లో రాబోయే కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మొక్కలు నాటటం, వాటిని పెంచటం దాని కోసం ప్రత్యేకమైన వ్యవస్థను ఏర్పాటు చేశారు.

## వినిమయ

లెక్చర్ క్లబ్. ఒకరి నుండి మరొకరికి పరిశోధనలు, విజ్ఞాన భావ ప్రసారానికి ఇది ప్రధాన వేదిక. ప్రతి నెల రెండవ శుక్రవారం నన్నయ విశ్వవిద్యాలయ ఆచార్యుని ఉపన్యాసం ఉంటుంది. దీని ద్వారా నూతన పరిశోధన అంశాలు, విజ్ఞానపరమైన ప్రసారానికి వినిమయ వేదికైంది.

## జె - స్టోర్

ఒక పరిశోధనా పత్రాన్ని రాయటానికి, దానికి సంబంధించి ఇప్పటివరకు జరిగిన పరిశోధనలు తెలుసుకోవటానికి, సూచనలు గ్రహించడానికి జె.స్టోర్ ఏర్పాటు చేశారు.పరిశోధన ఏమి చేయగలుగుతామో, ఏవిధంగా చేయవచ్చునో... లాంటి విశేషాలన్నీ ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాలలో సమాచారం కోసం జె - స్టోర్ ఎంతగానో ఉపయోగం.

## జె - గేట్

సైన్స్ మరియు ఇంజనీరింగ్ విభాగాల అన్ని సబ్జెక్టులలో విశ్వవిద్యాలయ మరియు అనుబంధ కళాశాలల అధ్యాపకులు విద్యార్థులు సభ్యత్వం పొందవచ్చు. జె గేట్ ప్రవేశానికి సంబంధించిన అనుమతిని విశ్వవిద్యాలయం ఇస్తుంది. దీని ద్వారా రచనలు, పరిశోధనలు, సబ్జెక్ట్ విశేషాలను పరిశీలించడానికి, ప్రచురించటానికి వీలవుతుంది.

## సైకలాజికల్ కౌన్సిలింగ్ సెంటర్

విద్యార్థులలో పరీక్షల భయాన్ని లేదా మానసిక ఒత్తిడిని దూరం చేయడానికి,వ్యాధుల పట్ల అవగాహన, మానసిక ప్రశాంతత వంటి విషయాలలో కౌన్సిలింగ్. పరీక్షలు నిర్వహించడానికి సంబంధించి సౌకర్యాలతో కూడిన సైకాలజీ ల్యాబ్. విశ్వవిద్యాలయ, అనుబంధ కళాశాలల విద్యార్థులకు, అధ్యాపకులకు, అలాగే సమాజానికి ఈ సెంటర్ తమ సేవలను విస్తరించింది. ప్రతిరోజు ఉదయం 10 గం.నుండి సాయంత్రం 5 గం.వరకు పనిచేస్తుంది. ముందుగా అపాయింట్మెంట్ తీసుకొని యూనివర్సిటీ హెల్త్ సెంటర్లో ఉన్న సైకాలజీ కౌన్సిలింగ్ సెంటర్ ని ఉపయోగించుకోవచ్చు.

## నన్నయ విజ్ఞాన భారతి

'నన్నయ విజ్ఞానభారతి' సైన్స్ జర్నల్ ప్రారంభించారు. నన్నయ విశ్వవిద్యాలయం మరియు అనుబంధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధన పత్రాలను, వ్యాసాలను ప్రచురించడం. జాతీయస్థాయి ప్రమాణాలతో విశ్వ విద్యాలయస్థాయి సంచిక ప్రచురణ కోసం విజ్ఞానభారతి ఏర్పాటు చేశారు.

## వినూత్న

ఓపెన్ ఎయిర్ క్లాస్ రూమ్. రవీంద్రనాథ్ ఠాగూర్ శాంతినికేతన్ విధానంలో కోవిడ్ లాంటి సమయంలో లేదా చెట్లకింద కూర్చుని ప్రకృతిలో తరగతి బోధన, అధ్యయనాలకు వీలుగా 'స్పృహ - సైకాలజీ' అలుమ్ని సహకారంతో ఈ "వినూత్న" ప్రకృతి తరగతిని ఏర్పాటు చేశారు.

# వుండవల్లి సత్యనారాయణ మూర్తి కళాశాల

## (వి.ఎస్.ఎం. కళాశాల - రామచంద్రపురం,తూ. గో.జిల్లా.)

మన కళాశాలలు





స్వర్గీయ వుండవల్లి సత్యనారాయణ మూర్తి గారు, వ్యవస్థాపకులు.



శ్రీ మెర్ల శివరామప్రసాద్ అధ్యక్షులు



శ్రీ ఎమ్.వి.వి.సుబ్బారావు సెక్రటరీ



శ్రీమతి కె.మధుర మీనాక్షి డైరెక్టర్



శ్రీ ఎస్.ఎన్. ఆలీ అన్సారి ప్రిన్సిపాల్



సర్ ఆర్థర్ కాటన్ మహాశయుని ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణంతో తూర్పు గోదావరి జిల్లా పూర్వపు ఆలమూరు, రామచంద్రపురం తాలూకాలు వ్యవసాయంలో ఎంతో అభివృద్ధి చెందినా విద్యాపరంగా ఉన్నత విద్యకు అవకాశాలు లేకపోవడంతో "రాయవరం మునసబు" గా పేరు ప్రఖ్యాతులున్న వుండవల్లి సత్యనారాయణ మూర్తి గారు ఈ ప్రాంతాన్ని విద్యాపరంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో 1965 సంవత్సరంలో రామచంద్రపురం ఎడ్యుకేషనల్ సొసైటీని ఏర్పాటు చేసి స్థానిక ప్రజల సహకారంతో 1966 సంవత్సరంలో

ఉండవల్లి సత్యనారాయణ మూర్తి కళాశాలను (VSM) ఉన్నత విద్యా శాఖ అనుమతితో ప్రారంభించారు. 1975 సంవత్సరంలో UGC 2f (12B) గుర్తింపు పొందింది. 2009 - 10 నుండి 2011-12 సంవత్సరాలలో ISO 9001 సర్టిఫికెట్, కాలేజీ ఫర్ పొటన్షియల్ ఎక్సలెన్స్ అవార్డు పొందింది.

2015 సంవత్సరంలో కళాశాలకు అటానమస్ హోదా లభించింది. ఆ సంవత్సరంలోనే పరీక్షల చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం CBCSను ప్రారంభించారు. 2017 సంవత్సరంలో NIRF నిర్వహించిన సర్వేలో భారతదేశంలో 93 వ స్థానాన్ని పొందింది. ఎనిమిది ఎకరాల సువిశాల ప్రాంగణంలో సకల సౌకర్యాలతో అందమైన భవనాలతో వైఫై సదుపాయాలతో తరగతులు నిర్వహిస్తున్నారు. 2009 సంవత్సరంలో వి.ఎస్.ఎమ్. ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు.

ఇంజనీరింగ్ కళాశాలలో 1000 మంది, పాలిటెక్నిక్ కళాశాలలో 500 మంది, డిగ్రీ - పీజీ కలిపి 3000 మంది, మొత్తం 4500 మంది విద్యార్థులు వి.ఎస్.ఎం. కళాశాల ప్రాంగణంలో విద్యనభ్యసిస్తున్నారు.

**పూర్వ విద్యార్థులు:**

రాజకీయ, సాహిత్య, విజ్ఞాన శాస్త్ర రంగాలలో అనేకమంది నిపుణులను వి.ఎస్.ఎం. కళాశాల దేశానికి అందించింది. వారిలో కొందరు ఉదాహరణకు.....

శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్ (రాజ్యసభ సభ్యులు)
శ్రీ వేగుళ్ళ జోగేశ్వరరావు (శాసనసభ్యులు-మండపేట) లిచిక్కాల రామచంద్రరావు ( మంత్రివర్యులుEx)
చుండ్రు శ్రీహరి (రాజమండ్రి లోక్ సభ సభ్యులు Ex)
ఆదిత్య విద్యాసంస్థల అధినేత డా.నల్లమిల్లి శేషారెడ్డి (అనపర్తి శాసనసభ్యులుEx) మొదలగువారు రాజకీయ రంగానికి చెందినవారు.

మెట్రో రైల్ ఎం.డి.శ్రీ ఎన్. వి. ఎస్. రెడ్డి, సైన్స్ సిటి వైస్ చైర్మన్ గా పనిచేసిన శ్రీ అప్పసాని కృష్ణారావు, గొడవర్తి భగవన్నారాయణ వంటి సైంటిస్టులు కళాశాల పూర్వ విద్యార్థులే. నాటి చారిత్రక పరిశోధకులు డా.గరికపాటి రుద్రయ్యచౌదరి గారి సూచనలు,సహకారం మరువలేనిది.

చలనచిత్ర రంగంలో ప్రముఖ గేయ రచయిత అభ్యుదయ కవి అదృష్టదీపక్, పైడిపాల, రచయితలు కొప్పర్తి వెంకట రమణమూర్తి, కె.వి.ఎస్.వర్మ , దాట్ల దేవదానం రాజు ఈ కళాశాలకు చెందినవారు.

ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు శ్రీ వేగుళ్ల మల్లికార్జునరావు,కేంద్రీయ విశ్వవిద్యాలయ చరిత్ర ఆచార్యులు అట్లూరి మురళి, నన్నయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి ఈ కళాశాల పూర్వ విద్యార్థులే.











రామచంద్రపురం ప్రాంతంలో గ్రామీణ విద్యార్థులకు విద్యాప్రభలను అందిస్తూ, ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయ అనుబంధ కళాశాలగా వెలుగొందుతున్న వి.ఎస్.ఎమ్.కళాశాల పాలకవర్గానికి, సిబ్బందికి, విద్యార్థులకు నన్నయవాణి శుభాకాంక్షల్ని తెలియజేస్తోంది.



- డా.బిక్కని బాలకృష్ణ

## కళాశాలను మరింత అభివృద్ధి పరుస్తాం

విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథ్ రావు గారి సూచనలు, సహకారంతో కళాశాలను మరింత అభివృద్ధి పరుస్తాం. గ్రామీణ విద్యార్థులకు కావలసిన కొత్త కోర్సులు, సౌకర్యాల కల్పన వంటి విషయాలపై దృష్టి సారిస్తున్నాం.



- మెర్ల సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షులు

## మంచి మాట

పసులవన్నె వేరు పాలేకవర్ణమౌ
పుష్పజాతి వేరు పూజ ఒకటి
దర్శనంబులు వేరు దైవంబు ఒక్కటి
విశ్వదాభిరామ వినురవేమ!

పశువుల రంగులు విభిన్నంగా ఉన్నా పాలు ఒకే రంగులో ఉంటాయి.పువ్వులు అనేక రంగుల్లో ఉన్నా పూజ మాత్రం ఒక్కటే.మత ధర్మాలు వేరైనా,ఎన్నివున్నా భగవంతుడు ఒక్కడేనని వేమన సందేశం.





ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in